క్లుప్తంగా

రోలుగుంట ఈవోపీఆర్డీగా నూకరాజు



నూకరాజుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న కార్యదర్శులు

రోలుగుంట: ఈవోపీఆర్డీగా కె.నూకరాజు నియమితులయ్యారు. ఇప్పటి వరకు నర్సీపట్నం డీఎల్పీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్‌గా పని చేస్తున్న ఈయనకు పదోన్నతి కల్పిస్తూ ఆ శాఖ నుంచి బదిలీ ఉత్తర్వులు జారీ అయ్యాయి. ఈ మేరకు ఆయన శుక్రవారం ఇక్కడకు బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పంచాయతీ కార్యదర్శులు రవికిరణ్, లాలం శివ, రాజ్‌కుమార్ తదితరులు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు.

చురుగ్గా జగనన్న ఆరోగ్య సురక్ష



రొంగలినాయుడుపాలెంలో ఆరోగ్య సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

కె.కోటపాడు: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వే చురుగ్గా కొనసాగుతోంది. చౌడువాడ పీహెచ్‌సీ పరిధి రొంగలినాయుడుపాలెంలో వైద్య సిబ్బంది, వలంటీర్లు శుక్రవారం ఇంటింటా సర్వే చేశారు. బి.పి, సుగర్, హెచ్‌బి పరీక్షలు చేయడంతోపాటు దీర్ఘకాలిక వ్యాధిగ్రస్తుల వివరాలను నమోదు చేసుకున్నారు. ప్రజలకు మంచి ఆరోగ్యం ప్రసాదించాలన్న లక్ష్యంతో సీఎం జగన్ ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని అమలు చేస్తున్నారని హెల్త్ అసిస్టెంట్ డి.ఎస్.ఎస్.రాజు తెలిపారు. కార్యక్రమంలో హెల్త్ విజిటర్ అచ్చియ్యమ్మ, ఏఎన్ఎం సత్యవేణి, వలంటీర్లు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

విజన్ బిల్డింగ్ శిక్షణ ప్రారంభం



గ్రామ సంఘాల ప్రతినిధులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

రావికమతం: జాతీయ జీవనోపాధుల విభాగం ఆధ్వర్యంలో డ్వాక్రా మహిళలు, సంఘాలు రానున్న కాలంలో ఏవిధంగా అభివృద్ధి చెందాలి, కలల సాకారం చేసుకోవాలనే అంశంపై మూడు రోజుల శిక్షణ కార్యక్రమం శుక్రవారం స్థానిక వెలుగు కార్యాలయంలో ప్రారంభమైంది. మహిళలు ఆర్థిక స్వావలంబన ఏ విధంగా సాధించుకోవాలి, సమర్థత గురించి వివరించేందుకు ఈ కార్యక్రమాలు దోహదపడతాయని ఏపీఎం దామోదర తిలక్ తెలిపారు. సభ్యులందరికీ రోల్ ప్లే, ఆటలు ద్వారా, చార్టులు ప్రిపరేషన్ ద్వారా అనేకమైన అంశాలను వివరించారు. డీఆర్‌డీఏ, ఐబీ ప్రతినిధులు, పలు మండలాల ఏపీఎంలు పాల్గొన్నారు.

టీడీపీ నేతల ఆరోపణలు అవాస్తవం



మాట్లాడుతున్న జెడ్పీటీసీ, ఎంపీపీ, పార్టీ మండల నాయకులు

గొలుగొండ: వైఎస్సార్‌సీపీ నేతలపై టీడీపీ నాయకులు చేస్తున్న అసత్య ఆరోపణలను ప్రజలు గమనిస్తున్నారని జెడ్పీటీసీ సుర్ల గిరిబాబు తెలిపారు. శుక్రవారం గొలుగొండలో పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన మాట్లాడుతూ రెండు రోజుల క్రితం మండలానికి చెందిన టీడీపీ నేతలు తమ పార్టీ నేతలపై అవాస్తవ ఆరోపణలు చేయడం హాస్యాస్పదంగా ఉందన్నారు. తనను వ్యక్తిగతంగా దూషించడంపై మండిపడ్డారు. పార్టీ అభివృద్ధి, ప్రజల సంక్షేమం కోసం పనిచేస్తున్న తమపై లేనిపోని ఆరోపణలు చేయడం తగదన్నారు. 20 ఎకరాల ప్రభుత్వ భూమిని ఆక్రమించి బినామీల పేరుతో సాగు చేస్తున్నామని టీడీపీ నేతలు చేస్తున్న ఆరోపణలపై కలెక్టర్‌కు ఫిర్యాదు చేశామన్నారు. వాస్తవాలు నిగ్గుతేల్చి వారిపై చర్యలు తీసుకోవాలని కోరామన్నారు. ఎంపీపీ గజ్జలపు మణికుమారి, పార్టీ మండలాధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, జెడ్పీటీసీల ఫోరం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు దొండా రాంబాబు, వైస్ ఎంపీపీలు సుర్ల బాబ్జి, జక్కు నాగమణి పాల్గొన్నారు.

తొలి రోజు పోరు అదుర్స్

పాఠశాల స్థాయిలోనే క్రీడా ఆణిముత్యాలను వెలికితీయడానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న స్కూల్ గేమ్స్ శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. చోడవరం, మాడుగుల నియోజకవర్గాల స్థాయిలో నిర్వహించిన ఈ పోటీల్లో తొలిరోజు క్రీడాకారులు తలపడ్డారు. నువ్వానేనా అంటూ సాగిన 9 విభాగాల్లో పలువురు తమ సత్తా చాటారు.

- పోటాపోటీగా తలపడిన క్రీడాకారులు
- ఉత్సాహంగా నియోజకవర్గ స్థాయి పోటీలు ప్రారంభం



చోడవరం రూరల్: పోటీలో తలపడుతున్న వాలీబాల్ జట్లు



చోడవరం రూరల్: ఖోఖో ఆడుతున్న బాలుర జట్టు



చీడికాడ: జిల్లాకు ఎంపికైన వాలీబాల్ జట్టుతో పీడీలు



చీడికాడ: పోటీలను ప్రారంభిస్తున్న ఎంపీపీ, తహసీల్దారు

చోడవరం రూరల్: చోడవరం నియోజకవర్గ స్థాయి అండర్ -14, 17 బాల బాలికల క్రీడా పోటీలు శుక్రవారం ఉత్సాహంగా ప్రారంభమయ్యాయి. ఈ పోటీల్లో చోడవరం, బుచ్చియ్యపేట, రావికమతం, రోలుగుంట మండలాల స్థాయిలో జరిగిన పోటీల్లో ఎంపికైన క్రీడాకారులు పాల్గొన్నారు. తొలిరోజున అండర్ -14, 17 బాలుర పోటీలను మండల పరిషత్ అధ్యక్షురాలు గాడి కాసులమ్మ, గాంధీ గ్రామం సర్పంచ్ గాడి అప్పారావు లాంఛనంగా ప్రారంభించారు. కబడ్డీ, వాలీబాల్, షటిల్, బాల్ బ్యాడ్మింటన్, ఖో-ఖో, త్రోబాల్ వంటి పలు క్రీడా అంశాలతోపాటు 100, 200, 400, 800, 1500, 3000 మీటర్ల పరుగు పందెం, లాంగ్ జంప్, హైజంప్, షాట్ పుట్, డిస్కస్, జావెలిన్ త్రో పోటీలు నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి పోటీల్లో ఎంపికైన జట్లు, క్రీడాకారులు జిల్లా స్థాయి ఎంపిక పోటీల్లో పాల్గొనడానికి అర్హత సాధిస్తారని క్రీడల నిర్వాహకుడు సింగంపల్లి అప్పలనాయుడు తెలిపారు. కార్యక్రమంలో మండల విద్యాధికారులు జయలక్ష్మి, సింహాచలం, పాఠశాల పేరెంట్స్ కమిటీ చైర్మన్ దాడి జగదీష్, స్పోర్ట్స్ అసోసియేషన్ డైరెక్టర్ జె.శ్రీను, పలు పాఠశాలల వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శనివారం అండర్ -14, 17 బాలికల పోటీలు జరుగుతాయని, ఈ పోటీలను ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ ప్రారంభిస్తారని అప్పలనాయుడు తెలిపారు.

స్కూల్ గేమ్స్‌తో మట్టిలో మాణిక్యాల వెలికితీత

చీడికాడ: స్కూల్ గేమ్స్ ద్వారా మట్టిలో మాణిక్యాలను వెలికితీయడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ కురచా జయమ్మ అన్నారు. శుక్రవారం చీడికాడలో నియోజకవర్గ స్థాయి స్కూల్ గేమ్స్‌ను ఆమె ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎంఈవో బొంజుబాబు మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించే ఈ గేమ్స్‌లో మొదటి రోజు బాలుర పోటీలు నిర్వహించామన్నారు. 9 విభాగాల్లో నిర్వహించే ఈ పోటీల్లో ప్రతిభ చూపిన జట్లను జిల్లా స్థాయి పోటీలకు ఎంపిక చేస్తామన్నారు. వాలీబాల్, కబడ్డీ, త్రోబాల్, ఖోఖో, టెన్నికాయిట్, బాల్ బ్యాడ్మింటన్, యోగా, షటిల్, అథ్లెటిక్స్ విభాగాల్లో పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. అథ్లెటిక్స్‌లో 100, 200, 400, 800, 1,600 మీటర్ల రన్నింగ్ విభాగాల్లో క్రీడాకారులను ఎంపిక చేశారు. చీడికాడ, దేవరాపల్లి, కె.కోటపాడు, మాడుగుల మండలాల నుంచి అండర్-14, 17 విభాగాలకు చెందిన బాలురు పోటీపడ్డారు. తహసీల్దార్ బి.వి.రాణి, వైఎస్సార్‌సీపీ రైతు విభాగం జిల్లా అధ్యక్షుడు యర్రా అప్పారావు, ఎంఈవో-1 రమణ పాల్గొన్నారు.

29న మహాజన సభను విజయవంతం చేయండి

ఏరియా సుగర్ కేన్ ఇన్‌స్పెక్టర్ కొండబాబు

రోలుగుంట: గోవాడ సుగర్ ఫ్యాక్టరీ ఆవరణలో ఈ నెల 29న నిర్వహించే మహాజన సభను విజయవంతం చేయాలని ఏరియా కేన్ ఇన్‌స్పెక్టర్ కొండబాబు తెలిపారు. ఈ మేరకు ఫ్యాక్టరీకి చెరకు తరలించే సభ్య రైతులకు నోటీస్ బుక్‌లను ఏరియా ఫీల్డ్‌మెన్ ద్వారా శుక్రవారం రోలుగుంట, జె.నాయుడుపాలెంలో పంపిణీ చేస్తున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ సభలో పాలకవర్గ సభ్యులు, కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, మేనేజింగ్ డైరెక్టర్ వి.సన్యాసినాయుడు పాల్గొంటారన్నారు. రైతుల సంక్షేమంతోపాటు చెరకుకు మద్దతు ధర, తదితర అంశాలు తెలుసుకుంటారన్నారు. ఫ్యాక్టరీ అభివృద్ధి, రైతుల సమస్యలపై చర్చ, ఆమోదం, పలు అంశాలపై నిర్వహించే ఈ సభకు పెద్ద ఎత్తున సభ్యరైతులు పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.

యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు

కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్



శిక్షణ ఇస్తున్న కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్

రోలుగుంట: వరి సాగులో యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారానే అధిక దిగుబడులు సాధ్యమని కృషి విజ్ఞాన కేంద్రం సస్యరక్షణ శాస్త్రవేత్త బండి నాగేంద్ర ప్రసాద్ రైతులకు సూచించారు. యలమంచిలి భాగవతుల చారిటబుల్ ట్రస్టు, కృషి విజ్ఞాన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం వరి సాగు యాజమాన్య పద్ధతులపై శరభవరంలో రైతులకు ఒక రోజు శిక్షణా కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా శాస్త్రవేత్త మాట్లాడుతూ మిత్రపురుగులను సంరక్షించుకోవడం ద్వారా చీడపీడలను నియంత్రించుకోవచ్చన్నారు. మోతాదుకు మించి ఎరువులు వినియోగించొద్దన్నారు. ఏవో విజయలక్ష్మి, గ్రామ స్థాయి వ్యవసాయాధికారి శ్రావణి, ప్రకృతి వ్యవసాయ శాఖ నుంచి సాయిలక్ష్మి, సాంబమూర్తి పాల్గొన్నారు.

అపరాల విత్తనాలు పంపిణీ



రైతులకు అపరాల విత్తనాలందిస్తున్న శాస్త్రవేత్తలు

బుచ్చెయ్యపేట: కొండెంపూడి కేవీకేలో అపరాల సాగు, వాటి యాజమాన్య పద్ధతులపై రైతులకు కె.వి.కె. సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు సౌజన్య, కిశోర్‌కుమార్ శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పలువురు రైతులకు ఆత్మ శాఖ సమకూర్చిన అపరాల విత్తన పేకట్లు, రాజ్మా చిక్కుళ్లు, వేపనూనె, జీవశిలీంధ్రనాశినిలను పంపిణీ చేశారు. కంది, మినప, పెసర, రాజ్మా, చిక్కుళ్లలో యాజమాన్య పద్ధతులపై శిక్షణ అందించారు.

మత్స్యవానిపాలెంలో ప్లాంట్ హెల్త్ క్లినిక్

రావికమతం: వరిలో వచ్చే సూక్ష్మధాతు లోపాలు, తెగుళ్లు, యాజమాన్య పద్ధతుల గురించి మత్స్యవానిపాలెంలో రైతులకు ప్లాంట్ హెల్త్ క్లినిక్ కార్యక్రమం ద్వారా కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం అవగాహన కల్పించారు. కె.వి.కె, రిలయన్స్ ఫౌండేషన్ సంయుక్తంగా నిర్వహించిన ఈ కార్యక్రమంలో కె.వి.కె సమన్వయకర్త డాక్టర్ రాజ్‌కుమార్, శాస్త్రవేత్తలు డాక్టర్ కిషోర్, డాక్టర్ సత్తిబాబు పాల్గొన్నారు. ప్రస్తుతం వరిలో జింకు, పొటాష్ లోపం ఎక్కువగా ఉన్నట్టు గుర్తించామన్నారు. దుబ్బు దశలో ఉన్న వరిలో అగ్గి, పొడ తెగులు, ఆకుముడత పురుగు ఆశించి ఉందన్నారు. వాటి నివారణకు సూచనలు చేశారు. సర్పంచ్ మలిచెట్ల గణేష్, రిలయన్స్ ప్రతినిధి తిరుమలరావు పాల్గొన్నారు.

ఎల్.బి.పట్నం రోడ్డుకు మోక్షం

- 15 ఏళ్లుగా శిథిలమైన రోడ్డు
- డిప్యూటీ సీఎం చొరవతో రూ.2.70 కోట్లతో తారురోడ్డు నిర్మాణం



శిథిలమైన రోడ్డు(ఫైల్)



అందుబాటులోకి వచ్చిన ఎల్.బి.పట్నం-మాడుగులు తారురోడ్డు

చీడికాడ: రెండు మండలాలను కలిపే ఎల్.బి.పట్నం-మాడుగుల శిథిలరోడ్డుకు డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు చొరవతో మోక్షం లభించింది. ఇటీవల తారురోడ్డుగా రూపాంతరం చెంది వాహనదారులకు అందుబాటులోకి వచ్చింది. చీడికాడ, మాడుగుల మండలాలను కలిపే సుమారు ఐదు కిలోమీటర్ల మేర పొడవుగల ఎల్.బి.పట్నం నుంచి కె.ఎల్.బి పట్నం మీదుగా 15 ఏళ్ల క్రితం తారురోడ్డు నిర్మించారు. నాటి నుంచి నేటి వరకు ఎటువంటి మరమ్మతులు చేపట్టకపోవడంతో పూర్తిగా శిథిలమైంది. అప్పట్లో ఈ రోడ్డును ఇటు నుంచి ఎల్.బి.పట్నం నుంచి కె.ఎల్.బి.పట్నం వరకు (చీడికాడ మండల సరిహద్దు) అటు నుంచి మాడుగుల నుంచి కె.ఎల్.బి.పట్నం (మాడుగుల సరిహద్దు) వరకు వేశారు. ఈ సరిహద్దుల మధ్య 200 మీటర్ల మేరకు మెటల్ రోడ్డు గానే మిగిలిపోయింది. ఈ సమస్యను రెండు మండలాలకు చెందిన ప్రజాప్రతినిధులు డిప్యూటీ సీఎం దృష్టికి తీసుకెళ్లడంతో అసంపూర్తిగా మిగిలిన మెటల్‌రోడ్డును తారురోడ్డుగా నిర్మించేందుకు నిధులు మంజూరు చేశారు. దీంతో ఎల్.బి.పట్నం నుంచి మాడుగులకు రోడ్డు నిర్మాణ పనులను మూడు మాసాల క్రితం ప్రారంభించి వేగవంతంగా పూర్తి చేసి అందుబాటులోకి తెచ్చారు. దీంతో ఏళ్ల తరబడి పడుతున్న రహదారి ఇబ్బందులకు బూడి చెక్కు పెట్టారు.

కష్టాలు తొలగాయి..

మా గ్రామం నుంచి మాడుగుల వెళ్లేందుకు ఇదే ప్రధాన రహదారి. ఈ రోడ్డు పూర్తిగా శిథిలం కావడంతో తీవ్ర ఇబ్బందులు పడేవాళ్లం. డిప్యూటీ సీఎం నిధులు మంజూరు చేసి యుద్ధ ప్రాతిపదికన పనులు పూర్తి చేయించి అందుబాటులోకి తీసుకొచ్చారు.

– బి.బాలకృష్ణ, ఉద్యోగి, ఎల్.బి.పట్నం

సీఎం దృష్టికి అభివృద్ధి పనులు

నర్సీపట్నం ఎమ్మెల్యే గణేష్



సీఎం జగన్‌మోహన్‌రెడ్డితో ఎమ్మెల్యే గణేష్

నర్సీపట్నం: పట్టణ మెయిన్ రోడ్డు విస్తరణ అంశాన్ని సీఎం వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డికి వివరించినట్లు ఎమ్మెల్యే పెట్ల ఉమాశంకర్ గణేష్ తెలిపారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా శుక్రవారం సీఎంను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మెయిన్ రోడ్డు విస్తరణతోపాటు నియోజకవర్గంలో ప్రధాన అభివృద్ధి పనులను సీఎం దృష్టికి తీసుకువెళ్లినట్లు తెలిపారు. గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన ప్రధాన సమస్యలను ప్రస్తావించానని తెలిపారు.

ఎన్నికల కమిషన్‌కు ఫిర్యాదుపై విచారణ



సిబ్బందికి సూచిస్తున్న తహసీల్దార్ శ్రీనివాస్‌నాయుడు

నాతవరం: ఎన్నికలు కమిషనర్ ఆదేశాల ప్రకారమే పోలింగ్ కేంద్రాల చేర్పు మార్పులు, ఓటరు నమోదు చేస్తున్నామని తహసీల్దార్ ఎస్.ఎస్.వి. శ్రీనివాస్‌నాయుడు తెలిపారు. 79, 80, 91 పోలింగ్ కేంద్రాలకు సంబంధించి పోలింగ్ బూత్ ఏజెంటు పారుపల్లి దివాణం ఎన్నికల కమిషనర్‌కు ఫిర్యాదు చేశారు. ఈ మేరకు శుక్రవారం వెదురుపల్లి రామాలయం వద్ద సర్పంచ్ కాళ్ల సత్యనారాయణ, ఉప సర్పంచ్ కురువాడ కొండబాబు, ఫిర్యాదుదారుడు సమక్షంలో తహసీల్దార్ బహిరంగ విచారణ చేపట్టారు. పంచాయతీ ఎన్నికల్లో కొవడటిపూడి అగ్రహారంలో 150 ఓటర్లు వెదురుపల్లిలో 79, 80 పోలింగ్ కేంద్రాల్లోనూ, అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో రాజుపేట అగ్రహారం 91 పోలింగ్ కేంద్రంలోనూ ఓట్లు వేస్తున్నారు. ఒకే గ్రామానికి చెందిన ఓట్లు రెండు పంచాయతీలో పరిధిలో ఉండటంతో వాటిని మార్పు చేయాలని సభలో కోరారు. నివేదిక రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌కు పంపిస్తామని, అక్కడ్నుంచి వచ్చిన ఆదేశాల అనుసరించి తదుపరి చర్యలు చేపడతామని తహసీల్దారు తెలిపారు. వీఆర్వో పోలింగ్ బూత్ అధికారులు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు ఉంచొద్దు

దేవరాపల్లి పీహెచ్‌సీ వైద్యాధికారి లలిత



దేవరాపల్లి ఎరుకుల కాలనీలో ప్రజల ఆరోగ్యంపై ఆరా తీస్తున్న వైద్యాధికారి లలిత, వైద్య సిబ్బంది

దేవరాపల్లి: ఇంటి పరిసరాల్లో నీటి నిల్వలు లేకుండా జాగ్రత్త పడాలని స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి ఎస్. లలిత సూచించారు. స్థానిక ఎరుకుల కాలనీలో డెంగ్యూ కేసు నమోదు కావడంతో వైద్య సిబ్బంది అప్రమత్తమయ్యారు. ఆ ఇంటి పరిసరాల్లో శుక్రవారం ప్రత్యేక పారిశుధ్య కార్యక్రమాన్ని చేపట్టారు. ప్రతి ఇంటికి వెళ్లి ఎవరైనా జ్వరాలతో బాధపడుతున్నారా అని ఆరా తీశారు. ప్రతి ఒక్కరూ పరిసరాల పరిశుభ్రతతోపాటు లార్వా వృద్ధి చెందకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని స్థానికులకు అవగాహన కల్పించారు. ప్రతీ శుక్రవారం డ్రైడే పాటించాలని సూచించారు. దోమ కాటుకు గురికాకుండా ప్రభుత్వం సరఫరా చేసిన దోమ తెరలను వినియోగించాలన్నారు. సీహెచ్‌వో పి. ప్రసాద్, ఏఎన్ఎం హైమా, సూపర్‌వైజర్ అప్పారావు, ఎంఎల్‌హెచ్‌పీ రాణి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

నెలాఖరులోగా ఈ-క్రాప్ నమోదు పూర్తి

మాడుగుల రూరల్: మండలంలో ఈ-క్రాప్, ఈకేవైసీ ఈ నెలాఖరులోగా పూర్తి చేయాలని ఏవో ఎం. వాసుదేవరావు తెలిపారు. శుక్రవారం స్థానిక మండల వ్యవసాయ శాఖ కార్యాలయంలో వ్యవసాయ, ఉద్యానవన సహాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంత వరకు 40 శాతం ఈ-క్రాప్ నమోదు పూర్తి చేశారని, మిగిలిన 60 శాతం ఈ నెలాఖరుకు పూర్తి చేయాలన్నారు. మండలంలో ఇంత వరకు 3,805 హెక్టార్లలో వరినాట్లు వేశారన్నారు. ఈ నెలాఖరికి శత శాతం పూర్తవుతుందని తెలిపారు. ఏఈవోలు సత్యనారాయణ, జగన్నాథరావు పాల్గొన్నారు.

18 గిరిజన గ్రామాల్లో ఆఫ్‌లైన్ సర్వే



ఇంటింటా సర్వే చేస్తున్న వైద్య సిబ్బంది

నాతవరం: జగనన్న ఆరోగ్య సురక్ష సర్వేలో ఇంతవరకు 2,900 ఇళ్లను పూర్తి చేశామని వైద్యాధికారి ప్రసన్న తెలిపారు. శుక్రవారం నాతవరం, వల్సంపేట, మర్రిపాలెం, చమ్మచింత, మర్రిపాలెం సచివాలయాల పరిధిలో ఇంటింటా సర్వే చేసిన వివరాలను ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సరుగుడు, సుందరకోట పంచాయతీల్లో 18 గిరిజన గ్రామాల్లో సెల్ సిగ్నల్ లేకపోవడంతో ఆఫ్‌లైన్ సర్వే చేయాలని కలెక్టరు ఆదేశించారన్నారు. తమ సిబ్బందికి ప్రజాప్రతినిధులు, ప్రజలు సహకరించాలన్నారు.

గౌరీ నందన గజవదన

ఊరూవాడా గణేష్ చతుర్థి వేడుకల్లో తరిస్తోంది. గ్రామగ్రామన వెలిసిన వినాయక మండపాల్లో ప్రత్యేక పూజలు చేస్తోంది. ఇందులో భాగంగా ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో శుక్రవారం పలుచోట్ల ముగ్గుల పోటీలు, అన్నసమారాధనలు, దీపాలంకరణ కార్యక్రమాలు నిర్వహించారు.



బుచ్చెయ్యపేట: వడ్డాదిలో అన్నసమారాధనలో పాల్గొన్న భక్తులు



కె.కోటపాడు: రంగులతో అలంకరించిన శివలింగాకారం



చీడికాడ: ప్రత్యేక పూజలు చేస్తున్న ఎంపీపీ జయమ్మ, తదితరులు



రావికమతం: కొత్తకోటలో ముగ్గుల పోటీలో పాల్గొన్న మహిళలు



మాడుగుల రూరల్: కె.జె.పురంలో అయ్యప్ప స్వామి అవతారంలో గణనాథునికి పూజలు

ఆకట్టుకున్న సహస్ర దీపాలంకరణ

కె.కోటపాడు: వినాయక యూత్ కమిటీ ఆధ్వర్యంలో వారాడ వినాయక మండపం వద్ద గురువారం రాత్రి దీపారాధన విశేషంగా ఆకట్టుకుంది. కమిటీ సభ్యులు, మహిళలు 1,116 దీపాలతో శివలింగాకారం, స్వస్తిక్, ఓంకారం ఆకృతిలో అలంకరించారు. వినాయక యూత్ కమిటీ సభ్యులు దొగ్గ నాగరాజు, లెక్కల జగ్గునాయుడు, గ్రామ పెద్దలు, యువకులు పాల్గొన్నారు.

మాకవరపాలెం: వినాయక నవరాత్రి ఉత్సవాలు ఘనంగా జరుగుతున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక లాలంవారి వీధిలో శుక్రవారం భారీ అన్నసమారాధన ఏర్పాటు చేశారు. స్థానికులతోపాటు ఇంతర గ్రామాలకు చెందిన భక్తులు పాల్గొని ప్రసాదం స్వీకరించారు. లక్ష్మీగణపతి యూత్ సభ్యులు పాల్గొన్నారు.

అన్నసమారాధనను ప్రారంభించిన ఎంపీపీ

చీడికాడ: స్థానిక గోపినగర్‌లో ఏర్పాటు చేసిన బాలగణపతిని ఎంపీపీ కురచా జయమ్మ శుక్రవారం దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఇక్కడ ఏర్పాటు చేసిన అన్నసమారాధన కార్యక్రమాన్ని ప్రారంభించారు. వైఎస్సార్‌సీపీ చీడికాడ గ్రామశాఖ అధ్యక్షుడు పరువాడ మహేష్, ఉన్నత పాఠశాల కమిటీ చైర్మన్ పీలా సుందరం పాల్గొన్నారు.

ఉత్సాహంగా ముగ్గుల పోటీలు, అన్నసమారాధన

రావికమతం: వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా కొత్తకోట 30 అడుగుల వినాయక విగ్రహం వద్ద సిద్ధి వినాయక యూత్ ఆధ్వర్యంలో రంగవల్లుల పోటీలు శుక్రవారం నిర్వహించారు. గ్రామం నుంచి పెద్ద ఎత్తున మహిళలు ఉత్సాహంగా పాల్గొని రకరకాల ముగ్గులు వేశారు. దొండపూడి వినాయక ఆలయం వద్ద ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో భారీ అన్నసమారాధన నిర్వహించారు.

వడ్డాదిలో..

బుచ్చెయ్యపేట: వడ్డాది మేజరు పంచాయతీ రాచకట్టు వీధిలో అన్నసమారాధన నిర్వహించారు. వినాయక నవరాత్రోత్సవాల్లో భాగంగా శుక్రవారం వినాయక మండపం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. మధ్యాహ్నం అన్నసమారాధన, రాత్రికి ప్రత్యేక భజనలు, భక్తి కీర్తనలు నిర్వహించారు.

కె.జె.పురంలో అయ్యప్పస్వామి అవతారంలో గణనాథుడు

మాడుగుల రూరల్: కె.జె.పురం నెహ్రూ వీధిలో మదర్‌థెరిస్సా టాలెంట్ యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అయ్యప్ప స్వామి అవతారంలో గణనాథుని విగ్రహం విశేషంగా ఆకట్టుకుంటోంది. ఇక్కడ 18 మెట్లపై ఆసీనులైన వినాయకుడి భక్తుల విశేష పూజలు అందుకుంటున్నాడు. నవరాత్రి ఉత్సవాలు అనంతరం భారీ అన్నసమారాధన నిర్వహిస్తామని యూత్ సభ్యులు తెలిపారు.

వెల్ఫేర్ అసిస్టెంట్ల నియామకం

మాడుగుల రూరల్: మండలంలో రెండు సచివాలయాలకు వెల్ఫేర్ అసిస్టెంట్లను నియమించామని ఎంపీడీవో మీనాకుమారి శుక్రవారం తెలిపారు. ప్రభుత్వ కారుణ్య నియామకాలల్లో భాగంగా జె.డి.పేటకు సి.హెచ్. కౌశిక్, వీరవల్లి అగ్రహారానికి వై.రఘురామయ్యలను వెల్ఫేర్ అసిస్టెంట్లుగా నియమించామన్నారు.

27న ఉపకరణాలు ఎంపికకు ప్రత్యేక శిబిరం

మాడుగుల రూరల్: విభిన్న ప్రతిభావంతులకు సహాయ ఉపకరణాలు ఉచితంగా అందించేందుకు ఈ నెల 27న చోడవరం ప్రభుత్వ హైస్కూలు ఆవరణలో ప్రత్యేక గుర్తింపు శిబిరం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో పి.ఎస్.ఎల్.ఎన్. మీనాకుమారి శుక్రవారం తెలిపారు. తెలిపారు. భారత ప్రభుత్వం గుర్తించిన ప్రముఖ కృత్రిమ అవయవాల తయారీ కేంద్రం (ఆలిమ్‌కో) హైదరాబాదు ఆధ్వర్యంలో కృత్రిమ అవయాలు, సహాయ ఉపకరణాలు, మూడు చక్రాల సైకిళ్లు, వీల్‌చైర్లు, చంక కర్రలు, కృత్రిమ కాళ్లు కాలిఫర్స్, రోలేటర్స్, చెవిటి మిషన్లు, వాకింగ్ స్టిక్స్, మానసిక ప్రతిభావంతు పిల్లలకు ఎం.ఎస్.ఐ.డి.కిట్స్, తదితర వాటి కోసం ఎంపిక చేస్తారన్నారు. సదరంతోపాటు ఆదాయ ధ్రువీకరణపత్రం, రేషన్ లేదా ఓటరు కార్డు, ఆధార్ కార్డు, నాలుగు పాస్ ఫోటోలు వెంట తీసుకుని రావాలన్నారు. ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు శిబిరం నిర్వహిస్తారన్నారు.